క్లుప్తంగా

రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్‌గా సయ్యద్ అనిస్



ఉయ్యూరు: రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్‌గా సయ్యద్ అనిస్ నియమితులయ్యారు. ఈ నెల 4, 5 తేదీల్లో నర్సీపట్నంలో జరిగిన రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ల శిక్షణ శిబిరంలో నియామక పత్రాన్ని అందించారు. రోటరీ గవర్నర్ ఆర్వీ సుబ్బారావు నియామకపత్రాన్ని అందించారు. అసిస్టెంట్ గవర్నర్‌గా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తానని అనిస్ తెలిపారు.

పలుచోట్ల పూడికతీత పనులు

రామవరప్పాడు: ప్రసాదంపాడులోని పలు ప్రాంతాల్లో సోమవారం ఇబ్బందికరంగా మారిన డ్రెయిన్లను గుర్తించి పూడికతీత పనులు నిర్వహించారు. పంచాయతీ ఆధ్వర్యాన గ్రామంలో సెయింట్‌ఆన్స్ పాఠశాల రోడ్డు, ఎస్సీ కాలనీ, బీఎంపీఎస్ రోడ్డు, జమ్మిచెట్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో పూడిక తీశారు. డ్రెయిన్లలో ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించి మురుగు సజావుగా పారడానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సర్నాల బాలాజీ గంగారత్నం మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మకంగా మారిన తిప్పగుంట డ్రెయిన్‌తో పాటు గ్రామంలోని అంతర్గత డ్రెయిన్లలో పూడిక తీస్తున్నట్లు చెప్పారు.

13న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉంగుటూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 13వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు తెలిపారు. స్థానిక విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ సరోజిని అధ్యక్షతన జరగనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



ఉంగుటూరు: పేద విద్యార్థుల చదువులకు దాతలు ముందుకు రావడం హర్షణీయమని హెచ్‌ఎం శేషుకుమారి అన్నారు. పెద అవుటపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు స్థానికులు బోయపాటి సీతారామాంజనేయులు, శ్రీమన్నారాయణ వారి తల్లిదండ్రులైన వెంకట సుబ్బయ్య, సుబ్బమ్మల జ్ఞాపకార్థం పరీక్ష సామగ్రిని సోమవారం అందజేశారు. వీకేఆర్ కళాశాల విద్యార్థులు ఇద్దరికి రూ.5 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



ఉయ్యూరు: తిరునాళ్లలో సేవా కార్యక్రమాలు అభినందనీయమని కంకిపాడు సీఐ పరమేశ్వర్ అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మినరల్ వాటర్ పంపిణీ కేంద్రాన్ని సోమవారం సీఐ పరమేశ్వర్, ఎస్ఐ వీరప్రసాద్ సందర్శించారు. భక్తులకు నీటిని అందించి వారం రోజులుగా సేవలు చేస్తున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో పినమాల నాగకుమార్, స్థానికులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలు

- తాళం వేసి ఉన్న ఇళ్లపై కన్ను
- 15 రోజుల్లో ఏడు ఇళ్లలో చోరీలు
- పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఘటనలు



కంకిపాడులో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అదనపు ఎస్ఐ లక్ష్మి (ఫైల్)

కంకిపాడు: వరుస దొంగతనాలతో జనం బెంబేలెత్తుతున్నారు. పదిహేను రోజుల్లో ఏడు ఇళ్లలో దొంగతనాలు జరగడంతో స్థానికులు టెన్షన్ పడుతున్నారు. తాళం వేసిన ఇళ్లపై చోర్‌గాళ్ల దృష్టి పెడుతున్నారు. ఇవన్నీ కూడా పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలోనే జరిగాయి.

తాళం వేసి ఉన్న ఇళ్లు లక్ష్యంగా..

గత నెల 23వ తేదీన 1, 25వ తేదీన 1, 31వ తేదీన 2, ఈ నెల 5వ తేదీన 3 దొంగతనాలు జరిగాయి. వెండి, బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడటం కలకలం రేపుతోంది. ఈ ఘటనలు జరిగిన ప్రాంతాలు పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు కూడా. అలాంటిచోట ఇళ్లల్లోనే చోరీలు జరగడంపై నిఘా కొరవడిందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో రాత్రిళ్లు గస్తీ ముమ్మరంగా సాగేది. అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను విచారించడం, అవసరమైతే వాహనాలను అదుపులోకి తీసుకునేవారు.

ఎస్ఐ పోస్టు ఖాళీ...తనిఖీలు అంతంతమాత్రం...

కంకిపాడు పోలీసుస్టేషన్ పరిధిలో కేసుల నమోదు ఏడాదికి కనీసం 500-600 వరకూ ఉంటున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. అలాంటి ముఖ్యమైన ఈ స్టేషన్ ఎస్ఐ పోస్టు సంక్రాంతికి ముందే ఖాళీ అయ్యింది. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ వై.దుర్గారావును ట్రాఫిక్ విభాగానికి బదిలీ చేశారు. ప్రస్తుతం అదనపు ఎస్ఐ, సిబ్బందితో స్టేషన్ నడుస్తోంది. సీఐ పర్యవేక్షిస్తున్నారు. అంతేకాకుండా రాత్రిళ్లు తనిఖీలు అంతంతమాత్రంగా సాగుతున్నాయని, అనుమానితుల సంచారం పెరిగిపోవటమే చోరీ ఘటనలు చోటుచేసుకోవటానికి కారణమని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు.

సమాచారమివ్వాలని ఇప్పుడు ప్రచారం

వరుస చోరీలు జరగడంతో ఇప్పుడు పోలీసులు అప్రమత్తమయ్యారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఊర్లు వెళితే తమకు సమాచారం ఇవ్వాలని మైక్ ప్రచారాన్ని చేపట్టారు. మండల వ్యాప్తంగా ఈ ప్రచారాన్ని సాగించేందుకు కార్యాచరణ చేయడం గమనార్హం. ఎస్ఐ పోస్టును భర్తీ చేసి నిఘాను కట్టుదిట్టం చేస్తేనే ప్రజలకు భద్రత లభిస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. దీనికి తోడు కోడిపందేలు, పేకాట శిబిరాలు యథేచ్ఛగా సాగుతుండటంతో మండల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్మికులు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు, ఇతర సిబ్బంది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. యనమలకుదురులో సోమవారం జరిగిన కార్యక్రమంలో కార్మికులు మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న తమకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవతో ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్‌సోర్స్ సర్వీసెస్ (ఆప్‌కాస్) పరిధిలోకి తీసుకు వచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. దీంతో తమ జీతాలు పెరగటమే కాకుండా ఆర్థిక సమస్యలు తీరుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం జగనన్నకు మంచి పేరు తీసుకురావడానికి శ్రమించి విధులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కోసూరి నరేష్‌కుమార్, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, గోపాలకృష్ణ, ఉద్దగిరి వినోద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కార్మికులకు వైఎస్సార్ సీపీ నేతలు మిఠాయిలు పంచి శాలువతో సత్కరించారు.

ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించండి

తాడిగడప మున్సిపల్ కమిషనర్ ప్రకాశరావు



పోరంకిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రకాశరావు

పెనమలూరు: పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో పేదలు జగనన్న గృహాలను నిర్మించుకోవడానికి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎన్.ప్రకాశరావు అన్నారు. పోరంకిలో సచివాలయ సిబ్బందికి ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. కమిషనర్ ప్రకాశరావు మాట్లాడుతూ వణుకూరు లే అవుట్ -2లో పోరంకి గ్రామానికి చెందిన వెయ్యి మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించామని తెలిపారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ 1.80 లక్షలు ఆర్థిక సాయం అందిస్తోందని చెప్పారు. సబ్సిడీపై సిమెంట్, ఐరన్ కూడా ఇస్తామని తెలిపారు. రుణ వసతి కూడా కల్పిస్తామని వివరించారు. లబ్ధిదారుల్లో అపోహలు ఉంటే సచివాలయ సిబ్బంది తొలగించాలని చెప్పారు. సమావేశంలో మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతో సంక్షేమ పాలన

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



చోడవరంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: పేద, మధ్య తరగతి కుటుంబాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన సోమవారం చోడవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వం పేదలకు అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలను బ్రోచర్ ద్వారా లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత ప్రజలకు పూర్తి సంక్షేమ పాలన జగనన్న మాత్రమే అందించారని చెప్పారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీమేరకు నేడు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పాలన అందుతోందన్నారు. పేదలు, రైతుల అభివృద్ధిని ప్రతిపక్ష టీడీపీ నేతలు చూడలేక పోతున్నారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయటం లేదని ప్రతిపక్షాలు ఆందోళనలు చేస్తుంటే.. మన రాష్ట్రంలో మాత్రం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందుకు ప్రతిపక్షం విషం కక్కుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచి కాకర్ల వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ నేతలు మండూరు కోటేశ్వరరావు, లింగాల సాంబశివరావు, కొడాలి విష్ణు, సింగంపల్లి రమాదేవి, కలతోటి ప్రసాదరావు, చోడవరపు రవిచంద్, దివినాగఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అత్తింటివారిపై వేధింపుల కేసు

పెనమలూరు: అదనపు కట్నం తేవాలని వేధిస్తున్న అత్తింటివారిపై పెనమలూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక గణపతినగర్‌కు చెందిన ఎండి.జక్రున్నీసా పదేళ్ల క్రితం ఎండీ షఫీని వివాహం చేసుకుంది. పెళ్లి సందర్భంగా కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఒక బాబు ఉన్నాడు. అయితే ఇచ్చిన కట్నం చాలలేదని అదనపు కట్నం తీసుకురావాలని భర్త, అత్త ఎండీ షమీమున్నీసా, మామా ఇస్సాక్, ఆడపడుచు నిజామున్నీసా, బంధువులు ఎండీ నాజర్, షాన్‌లు వేధిస్తున్నారు. ఇవి శ్రుతి మించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

పాతకక్షలతో దాడి

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో పాతకక్షల కారణంగా... వ్యక్తి అతని కుటుంబ సభ్యులపై పలువురు దాడి చేయడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సనత్‌నగర్‌లో నివసిస్తున్న మహబూబ్‌వలికి అతని ఇంటి ఎదురుగా ఉంటున్న రెహమాన్‌కు పాత కక్షలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో ఆదివారం మహబూబ్‌వలి, అతని కుటుంబ సభ్యులపై రెహమాన్, జబ్బార్, అష్రఫ్‌ఉన్నీసా దాడి చేశారు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కౌంటర్ కేసుల నమోదు

పెనమలూరు: ఫర్నిచర్ దుకాణ పార్టనర్ల మధ్య వ్యాపార విభేదాలు తలెత్తడంతో పరస్పర దాడులు చేసుకోవటంతో పోలీసులు సోమవారం కేసులు నమోదు చేశారు. పెనమలూరు సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం కానూరులో రమాదేవి ఫర్నిచర్ షాపు పార్టనర్లకు గతం నుంచి గొడవలు ఉన్నాయి. గతంలో కలిసి వ్యాపారం చేసిన కృష్ణలంకకు చెందిన సమ్మెట ఫణికుమార్, అతని భార్య విజయ షాపునకు వచ్చి ఫర్నిచర్ ధ్వంసం చేసి దాడి చేశారని రమాదేవి ఫిర్యాదు చేశారు. తమపై జి.నాగరాజు, రమాదేవి, నాగరాజు దాడి చేశారని సమ్మెట విజయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వీటిపై పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేశారు.

కోడిపందేలు నిర్వహిస్తున్న పదిమందిపై కేసు

పెనమలూరు: కోడి పందేలు నిర్వహిస్తున్న పది మంది వ్యక్తులపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరు డొంకలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందడంతో దాడి చేశారు. పందేలు నిర్వహిస్తున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.37 వేల నగదు, రెండు పుంజులు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

విద్యార్థులు ప్రతిభ చూపాలి



నగదు ప్రోత్సాహకాలు పొందిన విద్యార్థులతో దాతలు

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు చదువులో ప్రతిభ చూపాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చాగంటి సాంబిరెడ్డి అన్నారు. చదువులో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు దాతల సహకారంతో రూ.85 వేల నగదు బహుమతుల పంపిణీ కార్యక్రమం సోమవారం నున్న జెడ్పీ హైస్కూల్లో జరిగింది. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, నగదు బహుమతులను అందించడానికి దాతలు లక్షలాది రూపాయలను బ్యాంక్‌ల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశారు. కొందరు వ్యక్తిగతంగా పదో తరగతిలో ప్రథమ, ద్వితీయస్థానం సాధించిన వారికి నేరుగా నగదు బహుమతులను ఇస్తున్నారు. అందులో భాగంగా ఎఫ్‌డీలపై వచ్చే వడ్డీతో పాఠశాలలోని అన్ని తరగతుల వారికి 85వేల విలువ చేసే నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ దాతల ప్రోత్సాహం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాతలు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఎంజే చంద్రశేఖర్ రాజు, వీకేసీ ఫైడ చెప్పుల కంపెనీ ప్లాంట్ మేనేజర్ ఎ.అభిషమాన్, గుంటక నాగేశ్వరరెడ్డి, బొమ్మారెడ్డి లక్ష్మారెడ్డి, కామినేని కోటేశ్వరరావు, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో సెయింట్‌జాన్స్ విద్యార్థుల ప్రతిభ

గన్నవరం: జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో స్థానిక వీఎస్ సెయింట్‌జాన్స్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్‌లో భాగంగా జాతీయ స్థాయిలో చిత్రలేఖనం, పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్ పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. తమ విద్యార్థులు డ్రాయింగ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన డి. శ్రీనివాసరావును ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. సీనియర్ బ్రదర్ జిమ్మికురియోకోస్, బ్రదర్ భల్లా జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4 తేదీన జరిగిన స్టూడెంట్స్ కన్వెన్షల్ టీమ్ బిల్డింగ్ పోటీల్లో తమ కళాశాలకు చెందిన జూనియర్ ఏంఈసీ విద్యార్థులు వివిధ విభాగాల్లో బహుమతులు పొందారని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం కళాశాల ఆవరణలో అభినందించారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

నున్న(విజయవాడరూరల్): హృదయ శ్వాసకోశ పునరుజ్జీవన చర్య(సీపీఆర్) పై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డిస్ట్రిక్ట్ డిజాస్టర్ కోఆర్డినేటర్ రాధిక అశోక్ సూచించారు. సోమవారం స్థానిక వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ సేవా సమితి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో హృదయ శ్వాసకోశ పునరుజ్జీవన చర్య (సీపీఆర్)పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మనిషి ఆక్సిజన్‌ను తీసుకోలేనప్పుడు గుండెకు ఆక్సిజన్ పంపింగ్ ఆగిపోతున్న సమయంలో ప్రథమ చికిత్స ఉపయోగపడుతుందని తెలిపారు. సీపీఆర్ ఆవశ్యకతను, ఎలా ఉపయోగించాలో తెలియజేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ శివయ్య, కళాశాల చైర్మన్ నర్సిరెడ్డి, సెక్రటరీ సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమణ, జాతీయ సేవా సమితి కోఆర్డినేటర్స్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల ఆరోగ్యానికి కృషి



కోలవెన్నులో కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్

కంకిపాడు: అవ్వాతాతల ఆరోగ్య సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కోలవెన్ను ఎంపీటీసీ సభ్యురాలు తోకల ఉమాదేవి అన్నారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగును కోలవెన్నులో సోమవారం నిర్వహించారు. 64 మంది అవ్వాతాతలకు ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సీహెచ్ సరళ, ఎం.లక్ష్మి, వై.పద్మ, కె.రాజ్యలక్ష్మి, కె.మానస, ఎం.మెర్సి, జి.రజని తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీని గుర్తించడంపై అవగాహన

గన్నవరం రూరల్: శరీరంపై స్పర్శలేని మచ్చలను పరీక్షలు చేయించుకోవాలని మండలంలోని మాదలవారిగూడెం లింగయాస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ చెప్పారు. స్థానిక కళాశాలలో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన విద్యార్థులకు స్పర్శ లెప్రసీ అవేర్‌నెస్ క్యాంపెయిన్ జరిగింది.

ఆయన మాట్లాడుతూ చర్మంపై రాగి రంగు మచ్చలు, కళ్లు పూర్తిగా మూసుకుపోవటం వంటి లక్షణాలను గుర్తించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఏఎన్‌ఎం మేరీగ్రేస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠును నిర్లక్ష్యం చేయొద్దు

ఉయ్యూరు: కుష్ఠుపై నిర్లక్ష్యం వద్దని ఉయ్యూరు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ తేజస్విని అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో సోమవారం స్పర్శ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ ప్రభుత్వం కుష్ఠు వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకుంటోందన్నారు. స్పర్శ ద్వారా ఇంటింటికీ ఆరోగ్య సిబ్బందిని పంపి కుష్ఠు వ్యాధిగ్రస్తుల నిర్ధారణ చేపట్టామన్నారు. లక్షణాలను గుర్తించగానే ఆరోగ్య సిబ్బందిని కలిసి వైద్యం పొందాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, పీడీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫీజు చెల్లించాకే క్లాసులకు అనుమతిస్తాం!

విద్యార్థిపై ప్రైవేట్ కళాశాల యాజమాన్యం హుకుం

రామవరప్పాడు: ముందు ఫీజు చెల్లించు ఆ తర్వాతే తరగతి గదిలోకి అనుమతిస్తామంటూ ఓ కళాశాల యాజమాన్యం విద్యార్థిపై దురుసుగా ప్రవర్తించిన ఘటన సోమవారం వెలుగు చూసింది. సేకరించిన, బాధిత తండ్రి వి.మూర్తి తెలిపిన వివరాల ప్రకారం ... కుప్పంకు చెందిన వి.మూర్తికి ఇద్దరు సంతానం. వి.రాకేష్ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గూడవల్లిలోని చైతన్య కళాశాల సుమేధ క్యాంపస్‌లో ఇంటర్మీడియెట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇదే కళాశాలలో రాకేష్ ప్రథమ సంవత్సరం చదివే సమయంలో తోటి స్నేహితులతో గొడవ జరగడంతో పెన్నుతో కంటిపై దాడి చేశారు. ఈ క్రమంలో చెన్నైలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నాడు. ఈ క్రమంలో విద్యార్థి చికిత్స నిమిత్తం సుమారు రూ.3.5 లక్షలు కుటుంబ సభ్యులు ఖర్చు చేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మొత్తం ఫీజు చెల్లించినా రూ.15 వేలు బాకీ పడ్డారని కళాశాల యాజమాన్యం దురుసుగా ప్రవర్తించింది. ఖర్చులో ఉన్నామని నెలలో చెల్లిస్తామని చెప్పినా వినకుండా ఫీజు చెల్లించే వరకు తరగతులకు అనుమతించబోమంటూ రాకేష్‌ను తరగతులకు రానివ్వకుండా బయటే నిలబెట్టారు. విషయం తెలుసుకున్న విద్యార్థి తండ్రి మూర్తి కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

ప్రజాభాగస్వామ్యంతో డ్రగ్స్ రహిత ఏపీ

గన్నవరం: డ్రగ్స్ రహిత ఏపీ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని గన్నవరం డివిజన్ డీఎస్పీ కె.విజయపాల్ పిలుపునిచ్చారు. కేసరపల్లి నుంచి విమానాశ్రయం వరకు జాతీయ రహదారి పక్కనే డ్రగ్స్‌పై ప్రజలను చైతన్యవంతులను చేయడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యాన బ్యానర్లు ఏర్పాటు చేశారు. వీటిని సోమవారం పరిశీలించిన డీఎస్పీ మాట్లాడుతూ...డ్రగ్స్‌తో కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించడానికి ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు బ్యానర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్తు పదార్థాల విక్రయాలపై ఎటువంటి సమాచారం ఉన్న 14500 టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని సూచించారు. గన్నవరం సీఐ పి. కనకరావు, ఎస్ఐలు శ్రీనివాస్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థిక చేయూత

హనుమాన్‌జంక్షన్ రూరల్: నేషనల్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందజేసింది. ఏలూరు జిల్లా పెదపాడు మండలంలోని కలపర్రు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పామర్తి రాహుల్ సాయి షాట్‌పుట్ పోటీలకు, జి.అజయ్ డిస్కస్‌త్రో పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించడానికి జాతీయ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. బిహార్‌లోని పాట్నాలో ఈ నెల 12,13,14 తేదీల్లో జరిగే పోటీలకు హాజరయ్యేందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇబ్బందులు ఎదురుకావడంతో మానవత హనుమాన్‌జంక్షన్ శాఖను ఆశ్రయించారు. స్పందించిన మానవత సభ్యులు వీరిద్దరికి రూ.10 వేలు ఆర్థికసాయాన్ని ప్రయాణ, ఇతర ఖర్చుల నిమిత్తం సోమవారం అందించారు. మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు చక్కా సుబ్బారావు, బీఎస్ఆర్ మూర్తి, ఉపాధ్యక్షుడు గూడపాటి జయరామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

కంకిపాడు: కోమటిగుంట, తెన్నేరు, మారేడుమాక, వేల్పూరు, మంతెన, గొడవర్రు గ్రామాల్లో సోమవారం ఎస్టీయూ సభ్యత్వ చేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల మండల శ్రీనివాస్, ఇమ్మానుయేలు, పచ్చిగల్ల సురేష్‌బాబు, ఎ.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మల్లవల్లి భూనిర్వాసితులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడ భూసేకరణలో నష్టపరిహారం అందని నిర్వాసితులకు న్యాయం చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో జాతీయ దళిత జేఏసీ చైర్మన్ వరప్రసాదరావు ఆధ్వర్యంలో సాగుదారులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నష్టపరిహారం అందని సాగుదారులను నిర్ధారించడానికి అర్జీలు స్వీకరించామని, న్యాయం చేస్తామని ఆయన సానుకూలంగా బదులిచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మల్లవల్లి సాగుదారులు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల కామరాజు, వెంకట్రావు, మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు, రాజేష్ పాల్గొన్నారు.

తిరునాళ్లలో భక్తజన సందడి



అమ్మవారికి పొంగళ్లు తీసుకువెళ్తున్న భక్తులు

ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్ల కోలాహలంగా మారింది. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడానికి వస్తున్న భక్తజనంతో పాటు స్టాళ్లను సందర్శించి వస్తువులను కొనుగోలు చేసేందుకు వస్తున్న జనంతో ఆ ప్రాంగణం రద్దీగా మారింది. అమ్మవారిని సోమవారం డీఐజీ బాలరాజు కుటుంబ సభ్యులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పారుపూడి సుబ్బారావు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. మహిళలు పాలపొంగళ్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.